క్లుప్తంగా

6న మహంకాళి ఆలయం హుండీ లెక్కింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం ఈనెల 6వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీలను లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆసక్తి గల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని అన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని 16వ వార్డులో గతంలో వేసిన తాగునీటి పైపుల నుంచి నీరు వృథాగా పోతుండడంతో మంగళవారం నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. వాటర్ వర్క్స్ ఇంజినీర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల కిందట మహాలక్ష్మి చెట్టు దగ్గర నుంచి పై బజారులో ఏర్పాటు చేసిన జీఐ పైపులు అక్కడక్కడ తుప్పు పట్టి తాగునీరు వృథాగా పోతోందని స్థానికులు సచివాలయంలో ఫిర్యాదు చేయడంతో డీఈ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పాడైపోయిన పాత పైపులైన్లు తొలగించి వాటి స్థానంలో కొత్త పైపులైన్లు వేస్తున్నామని, కొన్నిచోట్ల లీకులు కాకుండా మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నృసింహునికి ఛత్రాల బహూకరణ



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గుంటూరుకు చెందిన ప్రముఖ ధార్మికవేత్త, సమాజ సేవకులు ఆకుల ఏడుకొండలు, శరత్ చంద్ర, విజయ్ కీర్తిలు మంగళవారం సుమారు రూ.30వేల విలువైన ఛత్రాలను బహూకరించారు. ఆ మేరకు మంగళవారం ఆలయ ఈఓ రామకోటిరెడ్డికి ఛత్రాలను అందజేశారు.

3న శ్రీ రామకోటి మహాక్రతు స్థూప ప్రతిష్ట

తాడికొండ: తాడికొండలో ఈనెల మూడో తేదీన కోదండ రామ చంద్రస్వామి వారి శ్రీ రామకోటి మహాక్రతు స్థూప ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ జనార్ధనాచార్య స్వామి, శ్రీమాన్ దిట్టకవి సుదర్శనాచార్య స్వామి వార్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఆలయంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరగనుందన్నారు. గురువారం శ్రీ రామకోటి ప్రతులు గ్రామోత్సవం, శుక్రవారం శ్రీ రామకోటి స్థూప శిఖర ప్రతిష్ట అనంతరం శ్రీరామ కల్యాణం జరగనున్నదని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని వారు సూచించారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్



పొన్నెకల్లు(తాడికొండ): పెరుగుతున్న నిర్మాణ రంగ సామాగ్రి ధరలను దృష్టిలో పెట్టుకొని జగనన్న ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. పొన్నెకల్లు గ్రామ సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ శాఖ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంత ప్రజలకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంత ప్రజలకు 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని, గడిచిన రెండు మాసాల్లో టీడీపీ వివిధ రూపాలలో ఆందోళనలు సాగించినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ మార్చి 2న విజయవాడ నగరంలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పచ్చల శివాజీ, ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, గ్రామ కార్యదర్శి రామినేని రామారావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

శరవేగంగా నిడమర్రు రోడ్డు విస్తరణ

- కొనసాగుతున్న పడమర బైపాస్ పనులు
- సీఆర్‌డీఏ గ్రామాలకు మహర్దశ
- త్వరితగతిన పూర్తి చేయాలని సూచించిన ఎమ్మెల్యే ఆర్కే



శరవేగంగా కొనసాగుతున్న నిడమర్రు రోడ్డు విస్తరణ పనులు

మంగళగిరి: నిడమర్రు రోడ్డు విస్తరణతోపాటు పలు రోడ్ల నిర్మాణాలు, పడమర బైపాస్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రోడ్ల విస్తరణ పనులు, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సీఆర్‌డీఏ గ్రామాల పరిధిలో కొనసాగుతున్న రోడ్ల నిర్మాణాలతో ఆయా గ్రామాలకు మహర్దశ పట్టనుంది. నిడమర్రు తాడికొండ రోడ్డు రూ.25.14 కోట్లతో నిర్మాణం చేపట్టగా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మంగళగిరి రైల్వే గేటు నుంచి ప్రారంభమయ్యే రోడ్డు నిడమర్రు, కురగల్లు, నీరుకొండల మీదుగా పెదపరిమి వరకు 23 కిలోమీటర్లు విస్తరించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలకు లింకు రోడ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. రోడ్డు విస్తరణతో ఆయా గ్రామాలతో పక్క గ్రామాల వారు మంగళగిరి పట్టణం నుంచి సచివాలయంతోపాటు తాడికొండ, అమరావతికి ప్రయాణం చేసే వారికి అన్ని రకాల ఉపయోకరంగా ఉంటుంది. నీరుకొండలో కల ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి, కురగల్లులోని అమృత యూనివర్సిటీలకు వెళ్లే విద్యార్థులకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకంగా ఉంటాయి. మరో వైపు చినకాకాని నుంచి మంగళగిరి, నిడమర్రు, నవులూరు, వెంకటపాలెం గ్రామాల మీదుగా కృష్ణా జిల్లా గొల్లపూడి వద్ద జాతీయరహదారిని కలుపుతూ నిర్మాణం జరుపుకుంటున్న పడమర బైపాస్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పడమర బైపాస్ నిర్మాణం కోసం నిడమర్రు రోడ్డుపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు పూర్తి కావస్తున్నాయి. కృష్ణానదిపై వంతెన నిర్మాణం ద్వారా గొల్లపూడి వద్ద హైవేకు కలిపి అక్కడ నుంచి ఏలూరు అవతల పూండ్ల వరకు బైపాస్ నిర్మాణం జరుగుతుంది. నిడమర్రు రోడ్డు విస్తరణ, పడమర బైపాస్ రోడ్ల నిర్మాణంతో సీఆర్‌డీఏ గ్రామాలకు మహర్దశ పట్టనుందనడంతో సందేహం లేదు. మరో వైపు నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పనులు చివర దశకు చేరుకోగా ఇప్పటికే రంజీ మ్యాచ్‌లు, ఇంటర్నల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. మరికొద్ది రోజులలో స్టేడియం నిర్మాణం పూర్తిచేసి ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. అభివృద్ధికి అడ్డంకిగా మారిన రైల్వేగేటు ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డును సైతం తరలిస్తుండగా ఇప్పటికే సగానికి పైగా చెత్తను అక్కడ నుంచి తొలగించారు.

ఊపందుకున్న భూముల క్రయవిక్రయాలు

సీఆర్‌డీఏ పరిధిలో గత కొద్ది రోజులుగా భూముల క్రయవిక్రయాలు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికంగా పడమర బైపాస్ రోడ్డు ఆనుకుని అధికంగా క్రయవిక్రయాలు జరుగుతుండగా, సీఆర్‌డీఏ గ్రామాలలో ధరలు పుంజుకోవడంతో క్రయవిక్రయాలు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే సీఆర్‌డీఏ గ్రామాలు మరింత అభివృద్ధి బాట పట్టనున్నాయడంలో సందేహం లేదు.

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో నివాసముంటూ ఇస్త్రీ చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తూ లిఫ్ట్ వైర్ తెగి తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. శస్త్రచికిత్స అనంతరం ఇంట్లోనే కోలుకుంటున్న తండ్రీకొడుకులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆయన ప్రకటించిన రూ.20వేల నగదును మంగళవారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజులు చంటికి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ యువజన నాయకులు తమ్మ మహేష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశుమరణాల నివారణకు కృషి



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి యానీ గ్రేస్

ఫిరంగిపురం: మాతా శిశుమరణాల నివారణకు ఆరోగ్యసిబ్బంది కృషి చేయాలని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి యానీ గ్రేస్ అన్నారు. మండలంలోని అమీనాబాద్, మునగపాడు గ్రామాల్లో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 104 వాహన సిబ్బందితో కలిసి ఆరోగ్యశిబిరం నిర్వహించారు. రెండు గ్రామాల్లో 123 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు అందజేశారు. రక్తపరీక్ష, మూత్రపరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు పరీక్షలు చేసి వారిలో హైరిస్క్ ఉన్నవారిని గుర్తించారు. యానీ గ్రేస్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గర్భిణులలో హైరిస్క్ ఉన్నవారిని ఆరోగ్యసిబ్బంది గుర్తించి వారికి అన్ని రకాల పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా హైరిస్క్ ఉన్నవారికి నెలలో రెండుసార్లు పరీక్షలు చేసి అవసరమైన వారిని గుంటూరులోని ప్రభుత్వవైద్యశాలకు చికిత్స కోసం పంపుతామని చెప్పారు. హైరిస్క్ ఏకారణాల వల్ల వస్తుందో వాటిని గుర్తించి దానిపై వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

మసీదు నిర్మాణానికి విరాళం



మసీద్ ప్రెసిడెంట్‌కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వద్ద గల పోలకంపాడు వద్ద నూతనంగా నిర్మిస్తున్న మసీదుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మంగళవారం విరాళం అందజేశారు. పోలకంపాడులోని మజిద్ ఎ బిలాల్ మందిర నిర్మాణం జరుగుతోంది. ఆ మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే అందజేసిన లక్ష రూపాయలు విరాళాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజులు మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ అసన్‌కు అందజేశారు. మసీదు ఫౌండేషన్ ఫిల్లింగ్‌కు గ్రావెల్‌ను కార్పొరేషన్ నుంచి అందజేస్తున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన నాయకులు తమ్మ మహేష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వెంకటరామిరెడ్డి, మసీదు ఇమామ్ అబ్దుల్ రహీమ్, మసీదు ప్రెసిడెంట్ ఎస్‌కె. ఖుద్దూస్ భాయ్, ఎస్ గౌస్‌భాయ్, రెహమాన్, జానీ, ఎస్‌కె అమీర్, ఎండీ మొహిద్దీన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటలో తలెత్తిన వివాదం

- ప్రైవేట్ స్కూలు విద్యార్థిపై దాడి
- జీజీహెచ్‌కు తరలింపు



తీవ్రంగా గాయపడిన విద్యార్థి ఎ.వెంకటసాయి

మేడికొండూరు: కబడ్డీ ఆటలో తలెత్తిన వివాదం చివరకు దాడికి దారితీసింది. ఈ సంఘటనలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని జీజీహెచ్‌కి తరలించారు. మండలంలోని డోకిపర్రు గ్రామానికి చెందిన ఆదిత్య, మనోజ్‌లు మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూలులో చదువుతున్నారు. అదే గ్రామానికి చెందిన వెంకటసాయి పేరేచర్ల ఇంటెల్ పబ్లిక్ స్కూలులో చదువుతున్నాడు. ఇటీవల ఇంటెల్ హైస్కూలులో కబడ్డీ పోటీలు జరిగాయి. అందులో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూలు జట్టు, ఇంటెల్ హైస్కూలు జట్టు తలపడ్డాయి. ఇంటెల్ స్కూలు జట్టు గెలుపొందింది. బయటి నుంచి క్రీడాకారులను తీసుకొచ్చి జట్టులో ఆడించారని ఆరోపిస్తూ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు ఘర్షణకు దిగారు. అప్పటి నుంచి వీరి మధ్య వాగ్వివాదం జరుగుతుంది. అందులో భాగంగా సోమవారం రాత్రి డొకిపర్రులో వాగ్వివాదం జరిగింది. అప్పుడు సర్దుమణిగింది. తిరిగి మంగళవారం మేడికొండూరుకు మంచినీళ్ల పైపు కొనుగోలు చేసేందుకు వెంకటసాయి, గట్టుపల్లి సాంబయ్యలు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపానికి రాగానే ఆదిత్య, మనోజ్‌లు వారి చేతుల్లో ఉన్న హాకీ స్టిక్కులతో బండిమీద వస్తున్న ఎ.వెంకటసాయిని వెనుకగా మోదారు. తలకు గాయంకాగా స్పృహ తప్పి కింద పడిపోయాడు. స్థానికులు 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.





● ఆత్మీయ స్వాగతం

తెనాలిలోని మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం జరిగిన సభకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

పోలకమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడులో వేంచేసిన ఉన్న పోలకమ్మ తల్లి దేవస్థానం 15వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వార్షికోత్సవం సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వంగ దేవ, తోక సత్యనారాయణ, బత్తుల ప్రభుదాసు, అనంత సత్యనారాయణ, తోక వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి వై.నేతాజీ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అందరికీ కనీస పెన్షన్ రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 5న రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకరరావు, కె.వెంగమ్మ, కొప్పనాతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కృష్ణా కరకట్ట వెంబడి కాకతీయ అక్వా నుంచి మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం వరకు, పెనుమాక గ్రామ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.


రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పాతగుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు 2వ తేదీ నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2న విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. 3న శేష వాహన సేవ, ప్రధాన ప్రాకార గోపుర దివ్య కలశ ప్రతిష్టా మహోత్సవం, ద్వారపాలక, గరుడాళ్వార్, ఆంజనేయ శిలా విగ్రహ ప్రతిష్ట, 4న హనుమత్ వాహనసేవ, 5న గజవాహన సేవ స్వామివారి ఊరేగింపు విశేషంగా జరుగుతాయని అన్నారు. కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు పద్మావతి కళావేదికపై పారాయణాలు, తాళం భజనలు, సువాసిని పూజ, చండీహోమం, 7న అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నృసింహునికి ప్రత్యేక పూజలు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి వారిని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. నృసింహుని బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి గ్రామోత్సవంలో వారు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నృసింహుని గ్రామోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఈఓ రామకోటిరెడ్డి

జాతీయ రహదారిపై ప్రమాదం

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- కారు డ్రైవర్‌ను తప్పించారనే విమర్శలు



బోల్తా కొట్టిన కారు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

మంగళగిరి: నగర పరిధిలోని తెనాలి ఫ్లైఓవర్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి కాజ టోల్‌గేట్ వద్ద ఖలీల్ భాయ్ హోటల్‌కు వెళుతున్న హోటల్ యజమాని కుమారుడు కారును అత్యంత వేగంగా నడిపి ముందు వెళుతున్న ఒక గూడ్స్ ఆటోను ఢీకొట్టాడు. కారు రోడ్డుపై బోల్తా కొట్టగా గూడ్స్ ఆటోతోపాటు మరో రెండు ద్విచక్ర వాహనాలను సైతం ఢీకొట్టింది. విజయవాడకు చెందిన గూడ్స్ ఆటో డ్రైవర్ బాదుల్లా కుర్‌కురే ప్యాకెట్ల లోడుతో పొన్నూరు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారును అత్యంత వేగంగా నడిపిన హోటల్ యజమాని కుమారుడు కారులో భారీగా నగదు ఉండటంతో దిగి నగదు బ్యాగుతో మరో ఆటోలో ఎక్కి పారిపోయినట్లు తెలిపారు. బాదుల్లాకు తీవ్ర గాయాలు కాగా ద్విచక్ర వాహనదారులకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించేటప్పటికే కారు డ్రైవర్ పారిపోగా స్వల్ప గాయాలైన ఇరువురు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్ర గాయాలైన బాదుల్లాను ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కారు డ్రైవర్‌తోపాటు క్షతగాత్రులైన ఇరువురి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగికి గాయాలు



గాయపడిన రైల్వే ఉద్యోగి శ్యామ్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రధాన రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైల్వే ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డాడు. సేకరించిన వివరాల ప్రకారం.. రైల్వే ఉద్యోగి శ్యామ్ తాడేపల్లి గేటు సెంటర్ నుంచి ఉండవల్లి సెంటర్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఉండవల్లి సెంటర్ నుంచి తాడేపల్లి వైపు అతి వేగంగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్యామ్‌కు ఎడమకాలుకి తీవ్ర గాయమైంది. ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు ఆటో నంబర్‌ను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన శ్యామ్‌ను బంధువులు, కుటుంబ సభ్యులు వైద్య నిమిత్తం విజయవాడలోని రైల్వే హాస్పిటల్‌కు తీసుకు వెళ్లారు. స్థానికులు ఇచ్చిన ఆటో నంబర్ ఆధారంగా పోలీసులు ఆటోను గుర్తించే పనిలో పడ్డారు.

శరవేగంగా ఆలయ రోడ్డు నిర్మాణ పనులు



పనులు చేస్తున్న పొక్లెయిన్

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ కొండపై వెలసిన మూలాంకురేశ్వరి అమ్మవారి ఆలయానికి వాహనాలు వెళ్లేందుకు వీలుగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఆలయ మేనేజ్‌మెంటు సభ్యులు మంగళవారం తెలిపారు. 15రోజులుగా పొక్లెయిన్‌తో చేస్తున్న పనులు కొంతభాగం వరకు రోడ్డు నిర్మాణానికి వీలుగా మట్టిని తోలించి చదును చేయిస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా ఆలయానికి సులువుగా వాహనాల్లో కొండపైకి చేరేందుకు మార్గం సుగుమం అవుతుందని చెప్పారు. త్వరలో ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం వల్లభాపురపు ప్రసాద్

రాయపూడి(తాడికొండ): విద్యార్థులు పరిశీలనా దృష్టి, శాస్త్రీయ దృక్పథాన్ని చిన్నప్పటి నుంచి అలవర్చుకుంటే భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగవచ్చని రాయపూడి మెయిన్ పాఠశాల హెచ్‌ఎం వల్లభాపురపు ప్రసాద్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలంటే మూఢ నమ్మకాలను విడనాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత కుమారి, అంగన్వాడీ టీచర్ సంసాద్ బేగం విద్యార్థులు పాల్గొన్నారు.